# పిల్లలకు ఆదేశం
# (6:1-3)

కార్లు నడపగోరిన అనేకమంది కార్లు నడిపించే విద్యకు సంబంధించిన కోర్సులో చేరుతారు. వారు కార్లనుగూర్చి, వీధుల్లో బండ్ల రాకపోకలకు సంబంధించిన చట్టాలను గూర్చి, రోడ్లమీద ఏర్పడే పరిస్థితులను గూర్చి కూడా అందులో చదువుతారు. బండ్లు నడిపించే విద్యలో పరీక్షలు ముగించిన తరువాత విద్య నేర్పే ఉపాధ్యాయులతో పాటు కార్లు నడిపే అనుభవంకొరకు రోడ్డుమీదికి కారును తెస్తారు.

"ఆగమన్న లైట్ల వద్ద నేను ఎక్కడా కారును ఆపను. నేను ఏమి చేయాలో ఒకరు చెప్పడం నాకు యిష్టముండదు. ఎరుపు రంగంటేనే నాకు గిట్టదు. నీవు ఏమి చెప్పినా నేను లక్ష్యపెట్టను, నిలుపుమనే ఎరుపు గురుతుల వద్ద నేను నిలుపను" అని ఒక విద్యార్థి తన ఉపాధ్యాయునితో అన్నాడనుకో. ఆలాటి విద్యార్థి కారు నడపడం నేర్చుకొన సిద్ధపడలేదు. ఎందుకంటే ఉపాధ్యాయునిగాని, చట్టాన్నిగాని గౌరవించడం అతడు నేర్చుకోలేదు.

కారు నడిపే ఉపదేశంవంటిది - దానికంటె ఎక్కువ ప్రాముఖ్యమైనదే ఎలా జీవించాలో తండ్రి తన పిల్లలకు నేర్పే పనియై ఉంటుంది. పౌలు యొక్క మాటల్లో మంచి ఆరంభానికి తగిన పాయింటు ఉంది:

> పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు, ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది. తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి (6:1-4).

బైబిలు ఏమి చెప్పుతుందో దాన్ని నొక్కి చెప్పడంవలన విజయవంతమైన తర్ఫీదు ఆరంభమౌతుంది. దేవుని పిలుపునకు తగినట్టుగా అటు పిల్లలు యిటు తల్లిదండ్రులు జీవింపవలసియుంది. గౌరవనీయమైన విధేయతకు దేవుడు పిల్లలకు పిలుపునిచ్చాడు. దైవికమైన లేక భక్తిగల నడిపింపుకు దేవుడు తల్లిదండ్రులకు పిలుపునిచ్చాడు.

ఇది అంత సులభమయ్యింది కాదని అటు పిల్లలు యిటు తల్లిదండ్రులు గుర్తించవలసి యుంది. తండ్రులు పిల్లలు కూడా ఒక యుద్ధాన్ని చేసినట్టున్నారు - అది ఒకరికి విరోధంగా ఒకరు యుద్ధం చేయడం కాదు. అది అపవాదికి విరోధంగా యుద్ధం చేయడమే ఔతుంది. దేవుని సంకల్పాన్ని అనుసరించేవారు విజయంకొరకు నిరీక్షించవచ్చు. దేవుని సంకల్పాన్ని తీవ్రంగా తీసికోనివారు అపజయం పొంద ఎదురు చూడవచ్చు.

ఈ యుద్ధంలో అపజయం పాలవ్వడానికి ఎవరైనా యిష్టపడతారని నేను తలంచను. గనుక గృహంకొరకు దేవుని సంకల్పం ఏమైయుంటుందో చూద్దాం. ఈ పాఠంలో 6:1–3లో పౌలు పిల్లలకు ఏమి చెప్పాడో దానిమీద దృష్టి నిలుపుదాం. దాన్ని ఈ విధంగా సంగ్రహం చేయవచ్చు: దేవుడు పిల్లలకు గౌరవపదమైన విధేయతకు పిలుపునిస్తున్నాడు.

## తమ తల్లిదండ్రులను గౌరవించుడని పిల్లలకు దేవుడు పిలుపునిచ్చాడు

గౌరవించడం యొక్క అవసరత 6:2లో నొక్కి చెప్పబడింది: "నీ తండ్రిని తల్లిని సన్మానింపుము." ఈ ఉపదేశము పిల్లలకు జీవితకాలమంతా ఉంటుంది. నీవు యింకా పసివాడవై నీ తల్లిదండ్రుల ఆధీనంలో ఉన్నా, లేక తండ్రివై నీకే సొంత కుటుంబమున్నా, నీ తల్లిదండ్రులను సన్మానించే బాధ్యత నీకు ఉంటుంది.

"సన్మానించు"మనే దానికి గ్రీకు పదం *timao*, అంటే, "విలువైనదిగా ఎంచు, మదించు లేక ఎక్కువగా ఎంచు, గౌరవించు" అని అర్థం. ఎక్కువ విలువైనవారినిగా నీవు వారిని ఎంచుతున్నట్టు చూడడం అని దాని అర్థం. నీ జీవితంలో దేవుడు వారికి నియమించిన పాత్రను బట్టి, నీ తల్లిదండ్రులను విలువైనవారని ఎంచడం అని దాని అర్థం.

నా చిన్నతనంలో కొన్ని సార్లు, నేను నా తల్లిదండ్రులను గౌరవించవలసినంతగా గౌరవించలేదు, అందులో ప్రత్యేకించి నా స్నేహితులతో సరదాగా బయటికి వెళ్లడానికి బదులు యింటిలో కూర్చుండి నా హోమ్ వర్క్ చేయుమని వారు నాకు చెప్పినప్పుడు యిష్టపడేవాడను కాను. నేను కలవరం చెందేవాడిని. అయితే మా అమ్మ, నాన్నలను నేను ప్రేమించేవాడిని. సంవత్సరాలు గడిచేకొలది, నా జీవితంలో వారి పాత్రను నేను అధికంగా గౌరవించ నారంభించాను.

తల్లిదండ్రులకు దేవుడనుగ్రహించిన పాత్ర ఏమి? వారి పని యొక్క వర్ణన 6:4లో యిలా యివ్వబడింది: "వారిని (పిల్లలను) ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పెంచడం." దైవికంగా నడిపించేవారైయుండడానికి దేవుడు తల్లిదండ్రులకు ప్రాథమిక బాధ్యత నప్పగించాడు. అనుదిన విషయాలలో తల్లిదండ్రులు పిల్లలను నడిపిస్తారు – స్నేహితులతో బయట తిరగడానికి బదులు యింట కూర్చుండి హోమ్ వర్క్ చేసికొనేలాటివి – కాని ఎక్కువ ప్రాముఖ్యంగా, తల్లిదండ్రులు పిల్లలను దేవునివైపుకు మళ్లించడం వారి కర్తవ్యమైయుంది.

> రాగల తరములలో పుట్టబోవు పిల్లలు దాని నెరుగునట్లును
> వారు లేచి తమ పిల్లలకు దానిని వివరించునట్లును
> వీరును దేవునియందు నిరీక్షణగలవారై దేవుని క్రియలను మరువకయుండి
> యథార్థహృదయులు కాక దేవుని విషయమై స్థిర మనస్సులేనివారై
> తమ పితరులవలె తిరగబడకయు
> మూర్ఖత తిరుగుబాటునుగల ఆ తరమును పోలియుండకయు
> వారు ఆయన ఆజ్ఞలను గైకొనునట్లును

ఆయన యాకోబు సంతతికి శాసనములను నియమించెను
(కీర్తన. 78:5-7).

పిల్లలు తల్లిదండ్రులను ఎందుకు గౌరవించాలి? తన పక్షంగా మాట్లాడేవానిగాను, దేవుని కథ యొక్క వర్తమానికునిగాను, దేవుని ఆజ్ఞల ఉపదేశకునిగాను తండ్రిని దేవుడు నియమించాడు గనుక.

మన తల్లిదండ్రులను గౌరవిస్తాం ఎందుకంటె, విశ్వాసపు బెత్తము లేక అధికార చిహ్నము వారి చేతుల్లో ఉంది. మరియు వారు దానిని మనకు అప్పగించే పాత్రను దేవుడు వారికి యిచ్చాడు. తమకు అప్పగించిన బాధ్యతను తల్లిదండ్రులు ఎల్లవేళలా జరిగించరు. అప్పుడప్పుడు వారు దానిని క్రింద పడవేస్తారు. గనుక వారికొరకు ప్రార్థించు. నీ తల్లిదండ్రులను సన్మానించడంవలన దేవుని ఘనపరచు. నీవు ఏమి చేయాలని దేవుడు కోరుతున్నాడో దానిని జరిగించు.

కొందరు నవయువకులు, మరియు కొందరు వయస్సువచ్చినవారు – తమ తల్లిదండ్రులను కాలి దుమ్ముతో సాటిగా కూడా చూడరు. దుమ్ముకు విలువ ఏమీ ఉండదు. అది రోతగాను, కంటికి శోకంగాను ఉంటుంది. మన తల్లిదండ్రులను పీడ అనుకొనే ఏ బిడ్డయైనా, జీవితంలో ఎక్కువ మేలు పొందలేదు. బైబిలు యిలా అంటుంది: "నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు" (6:3).

నీ తల్లిదండ్రులను సన్మానించడానికి పౌలు రెండు మంచి హేతువులనిచ్చాడు. మొదటిది, "నీకు మేలు కలుగునట్లు" అనేది. "మేలు" అనేదానికి గ్రీకులో *eu* అనే చిన్న పదముంది. "eulogy" అనే ఆంగ్ల పదంలో అది కన్పిస్తుంది – ఒకరిని గూర్చి మంచిగా చెప్పేది. పౌలు దినాల్లో ఒకనికి నమస్కరించి "భళా, మిక్కిలి మంచిగా చేశావు!" అని చెప్పడానికి ఈ చిన్న పదాన్ని ఉపయోగించేవారు. నీవు నీ తల్లిదండ్రులను సన్మానించినప్పుడు, "భళా, మిక్కిలి మంచిగా చేశావని" దేవుడు నీకు చెప్పుతున్నట్టు నీవు ఎరుగవచ్చు.

నీ తల్లిదండ్రులను సన్మానించడానికి మరొక మంచి హేతువు ఈ క్రింది మాటల్లో కన్పిస్తుంది: "నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు." గారీ ష్మల్లీ మరియు జాన్ ట్రెంట్ దీన్ని ఎలా వివరించారో గమనించు:

> తమ తల్లిదండ్రులను సన్మానించేవారు వాస్తవంగా జీవాన్ని పొందుతారని దేవుడు వాగ్దానం చేశాడు! ఇది ఎలా సాధ్యమౌతుంది? ఎక్కువమంది వైద్యులను హితవు చెప్పేవారిని లేదా (సువార్తికులను) అడుగు. తమ తల్లిదండ్రులను అవమానించినవారి జీవితాలు చితికిపోయినట్టును, తత్ ఫలితంగా వారి బలం కారిపోయినట్టును వారు తమ కార్యాలయాల్లో చూచారు.
>
> ... కోపాన్నిబట్టి, దుఃఖాన్నిబట్టి లేదా దురభిప్రాయాన్నిబట్టి తమ తల్లిదండ్రులను ద్వేషించి అవమానపరచినప్పుడు, వారు ఆత్మ సంబంధమైన, ఉద్వేగ సంబంధమైన, మరియు భౌతిక లేక శరీర సంబంధమైన వెలను చెల్లించారు.[1]

నీవు నీ తల్లిదండ్రులను సన్మానించినప్పుడు, వారిని మిక్కిలి ఘనంగా ఎంచుతావు.

ఆలాటి స్వభావం భూమిమీద నీ జీవితపు సహజగుణం వృద్ధిచెందుతుందని దేవుడు అంటాడు.

పిల్లలు తమ తల్లిదండ్రులను ఎలా సన్మానించగలరు? తమ తల్లిదండ్రులతో యింకను యింటివద్దనున్న పిల్లలు ఈ తలంపులను ఆలోచింపవచ్చు.

1. **దేవుడు నీ తల్లిదండ్రులకిచ్చిన పాత్రను గౌరవించు.** వారు నీ మేలుకొరకు దేవుడు ప్రసాదించిన బహుమానములైయున్నారు.

2. **వారి దృష్టిలోనుండి నీవు నీ జీవితాన్ని చూడ ప్రయత్నించు.** అనుదిన జీవితంలో వారు అనుభవించే ఒత్తిడిని గూర్చి ఆలోచించు. నీ విషయమై వారి మనస్సులో ఉన్నవాటిని గూర్చి ఆలోచించు. నీ నిమిత్తం నీ తండ్రి పడే కష్టాన్ని, నీ తల్లి అనేక సార్లు అనుభవించే ఒంటరితనాన్ని గూర్చి ఆలోచించు. నీ తల్లిదండ్రులకుండే కొన్ని అవసరతలను గుర్తించి వాటిని జరిగించడానికి నేర్చుకో.

3. **నీ తల్లిదండ్రుల సలహాను అడుగు.** ఎక్కువమంది నవ యువకులు కోరేదానికి అది వ్యతిరేకమైయుంటుంది. ఇష్టపూర్వకంగా యితరుల సలహా అడగడం పరిపక్వానికి గురుతైయుంటుంది. నీ తల్లిదండ్రులకు అది తెలుసు, వారిని సలహా అడిగినందుకు వారు నిన్ను గౌరవిస్తారు.

4. **నీ తల్లిదండ్రులకు అభినందనను కనుపరచు.** వారికొరకు భోజనం సిద్ధపరచు. వారి భారం తేలికయ్యేలా ఏదో ఒకటి చేయి. నీవు చేసేదానిని బట్టి వారంటే నీకు ఎంతో గౌరవమున్నట్టు వారికి తెలియనిమ్ము.

5. **వారికొరకు ప్రార్థించు.** నీవు నీ తల్లిదండ్రులకొరకు ప్రార్థిస్తావా? నీవు దాన్ని క్రమంగా చేస్తే, దేవుడు నీ విషయమై ఆనందిస్తాడని నాకు తెలుసు.

6. **వారిని ప్రేమిస్తున్నట్టు నీ తల్లిదండ్రులకు తెలుపు.** నీ తల్లిని గాని, నీ తండ్రిని గాని కౌగలించుకొని "నేను నిన్ను ప్రేమిస్తున్నానని" చెప్పి ఎంతకాలమయ్యింది?

పెద్దవారైన పిల్లలకు: తల్లిదండ్రులు యింకను మీతో ఉన్నప్పుడే వారిని సన్మానించే మార్గాలను కనుగొనండి. వారి వృద్ధాప్యమందు వారిని గౌరవించి జాగ్రత్తగా చూడండి. అంటే నీవు వారిని అలక్ష్యం చేయకూడదు. నీవు వారికి బిడ్డగా లేనట్టు వారు తమ జీవితాలను ముగించకూడదు. వారిని యిప్పుడును, వారు వెళ్లిపోయిన తరువాత గౌరవించినట్టే గౌరవించు. "నీ తల్లిదండ్రులను సన్మానింపుము."

## తల్లిదండ్రులకు లోబడునట్లు పిల్లలకు దేవుడు పిలుపునిచ్చాడు

"పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే" (6:1). "విధేయులైయుండుడి" అనేదానికి గ్రీకు పదం (*hupakouo*) "విను," "క్రింద" అనే రెండు పదాల సమ్మేళమైయుంది. అక్షరార్థంగా "విని అణగియుండు" అని దాని భావం. ఒకరు మరొకరి అధికారం క్రింద ఉండి చెప్పినదానిని విని అధికారమున్న వ్యక్తికి లోబడియుండుమని చెప్పుతుంది.

“తండ్రి శిక్షించిన కుమారుడు జ్ఞానముగలవాడగును. అపహాసకుడు గద్దింపునకు లోబడడు” అని బైబిలు అంటుంది (సామెతలు 13:1). బైబిలు విధేయతను బోధిస్తుంది గాని, ఈ రోజులలో ఈ భావన జనామోదాన్ని పొందలేదు. మన నాగరికత దీనికి వ్యతిరేకంగా చేయమంటుంది. “మీ తల్లిదండ్రుల మాట లక్ష్యపెట్టవద్దు”; “వారు ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియదు” అని నాగరికత అంటుంది.

నేనూ అలాగే అనుకునేవాడిని. “నేను పద్నాలుగేండ్లవాడనైయున్నప్పుడు, జీవించిన వారందరిలో మా నాయనయే అతి జ్ఞానహీనుడని అనుకునేవాడను, కాని నాకు ఇరవైయొకటి వయస్సు వచ్చేసరికి ఆ ఏడు సంవత్సరాలలో ఆయన ఎంతగా నేర్చుకున్నాడో దానికి నేను ఆశ్చర్యపోయాను” అని అనిన మార్కు ట్వెయిన్‌తో నేను పోలిక కలిగి యున్నాను. ఇంతకు మార్కు ట్వెయిన్ ఏమన్నాడంటే – తన తండ్రికి ఉన్న జ్ఞానాన్ని తాను అర్థం చేసికొనడానికి ఏడు సంవత్సరాలు పట్టిందట. ఈ విషయాన్ని తమాషాగా అతడు అలా అన్నాడు.

దేవుడు విషయాన్ని తేటగా ఉంచాడు. పిల్లలకొరకైన తన ఆలోచనలు అపార్థం చేసికొనడానికి ఆయన యిష్టపడలేదు. “పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే.” నీ తల్లిదండ్రుల ఉద్దేశాన్ని కొన్ని సార్లు నీవు గ్రహించకపోవచ్చు కూడా. నీవు ఏమి చేయాలి? నీవు లోబడాలా?

నికోలా తన స్నేహితురాలు బెక్కీతో కూడా యింటికి వెళ్లింది. “నికోలా, యిప్పుడే నీ పైగదిలోనికి వెళ్లు. నీ గదిని నీవు చెండాలంగా ఉంచావు” అని ఆమె తల్లి ఆమెతో అన్నది.

“సారీ, మామ్, నేను దాన్ని బాగుచేస్తానులే.”

నికోలా, బెక్కీలు మేడ గదిలోనికి వెళ్లారు. “మీ అమ్మకు ఏమయ్యింది? ఆ సంగతి చెప్పవద్దని మీ అమ్మకు నీవెందుకు చెప్పలేదు? నా స్నేహితురాలి యెదుట మా అమ్మ నన్ను అలా అంటేనా, తిరిగి ఆమెను నేను అలాగే యిచ్చుకునే దానినే!” అని బెక్కీ అంది.

నికోలా కొన్ని బట్టలను సరిచేస్తూ, “బెక్కీ, యిది నేను ముందే చేయవలసింది. ఈ ఉదయం నేను వెళ్లకముందు నా గదిని శుభ్రం చేస్తానని నేను మా అమ్మకు చెప్పాను. ఆమె సరిగానే చెప్పింది. పైగా, ఆమెకు ఈ రోజు విరామం లేకుండా ఉందని నేను చెప్పగలను” అని అన్నది. తల్లిని గౌరవించడమంటే అది.

ఇంటివద్ద ఇబ్బందికరమైన జీవితం ఉండడమంటే, యింటి కొరకైన దేవుని ఏర్పాటును అలక్ష్యం చేయడం, బిడ్డగా ఏమి చేయాలని దేవుడు నీనుండి ఎదురు చూస్తున్నాడో దాన్ని మరచి, తల్లిదండ్రులతో యుద్ధం ప్రకటించడమే అయ్యుంటుంది. ఇంటిలో ప్రతి ఒక్కరు స్వార్థంగా ఉండ తీర్మానించుకున్నట్టయితే, నీ గృహము అయిష్టమైన చోటుగా రూపొందుతుంది. దానికి భిన్నంగా, మీ యిల్లు సాధ్యమైనంత శ్రేష్ఠమైన కుటుంబ జీవితాన్ని యిచ్చేదిగా కోరుకున్నట్టయితే, దేవుని సంకల్పాన్ని కార్యాచరణలోనికి దించడం అవసరమైయుంటుంది.

“పిల్లలారా, మీ తల్లిదండ్రులకు విధేయులైయుండుడి” అనే ఆజ్ఞ – యింకను యింటనున్న పిల్లలకు – చిన్న పిల్లలకు నవ యువకులకు ఉద్దేశింపబడినదైనట్టుంది.

తిరిగి మాట్లాడకుండ, చపల చిత్తం లేకుండ, సగౌరవంగా మీ తల్లిదండ్రులకు విధేయులై ఉండాలని దేవుడు మిమ్మును దర్శిస్తున్నాడు.

ప్రభువైన యేసును గూర్చి బైబిలు ఏమి చెప్పుతుందో ఆలోచించు. ఆయన పన్నెండేండ్ల ప్రాయము గలవాడైయున్నప్పుడు, "... ఆయన వారితో కూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడియుండెను" (లూకా 2:51). "యేసూ, నీ గదిని నీవు శుభ్రం చేసికో"; "యేసూ, నీ వస్తువులను భద్రంగా ఉంచుకో"; "యేసూ, బాగా చదువు"; "యేసూ, పండుకో"; "యేసూ, మనుష్యులతో దయగా ఉండు, పెద్దలను గౌరవించు" అని చెప్పవలసి వచ్చిందో, ఏమో. యేసు పసివాడుగా ఉండిన సంగతిని మనం మరచిపోతామనుకుంటా. ఆయనకు తల్లిదండ్రులనబడినవారున్నారు. తన సొంత వ్యక్తిత్వాన్ని జీవిత విధానాన్ని పెంచుకొనడంలో ఆయన అంచెలుగా వృద్ధిచెందుతాడు – కాని ఆయన వాటిని గౌరవంతోను, విధేయతతోను జరిగించాడు.

యువకులు ఆలోచించడానికి నేను మూడు సంగతులను చెప్పుతున్నాను.

1. నీవు నీ విధేయతవలన యింటిలో సంఘీభావాన్ని వృద్ధిచేస్తున్నావా లేక, నీ అవిధేయతవలనను సహకరించకపోవడంవలనను యింటిలో తొందరలు కలిగిస్తున్నావా?

2. ఇష్టపూర్వకంగా నీవు నీ తల్లిదండ్రులకు లోబడుతున్నావా లేక ఎంతవరకు వీలుంటే అంతవరకు నీ స్వ ఆలోచనతో సాగిపోతున్నావా?

3. నీ తల్లిదండ్రులను ట్రీట్ చేయడం, లేక గౌరవించడం అనే యుద్ధంలో గెలుపొందుతున్నది – ప్రభువా లేక అపవాదియా?

## ముగింపు

జీవితం కొరకైన సిద్ధపాటులో దేవుడు పిల్లలను తల్లిదండ్రులకు అనుగ్రహిస్తాడు. తల్లిదండ్రులకు అవిధేయత అనేది బిడ్డ చేసే బహు ఘోరమైన పొరపాటైయుంటుంది. ఆ సమయంలో అది అంత పెద్దగా కన్పించకపోవచ్చు. కాని అది అతని తల్లిదండ్రులకు వ్యతిరేకంగా వెళ్లుతుంది, అది దేవుని వాక్యానికి విరుద్ధంగాను కడకు దేవునికే వ్యతిరేకంగాను వెళ్లుతుంది.

కొన్ని సార్లు తల్లిదండ్రులు న్యాయంగా ఉండరు. దీన్ని గూర్చి తరువాత పాఠంలో మాట్లాడబోతాం. ఏదియెలాగున్నా, పిల్లలు తమ తల్లిదండ్రులను సన్మానించి వారికి లోబడియుండునట్లు దేవుడు పిల్లలకు యింకను పిలుపునిస్తునే ఉన్నాడు. మన చెడ్డ ప్రవర్తనను విషయాన్ని దేవుడు చూచుకుంటాడు. నీ ప్రవర్తనను నీవు జాగ్రత్తగా చూచుకో.

సంతోషకరమైన కుటుంబానికి దేవుని ఏర్పాటును అనుసరించడమే మార్గం. దేవుడు మాత్రమే ఆ నిరీక్షణయై ఉన్నాడు. ఆయన వాక్యము ఆ మార్గాన్ని మనకు చూపుతుంది.

---

సూచనలు

[1]Gary Smalley and John Trent, *The Blessing* (Nashville, Tenn.: Thomas Nelson Publishers, 1986), 203.